క్లుప్తంగా

29న సింగరేణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

శ్రీరాంపూర్: ఈ నెల 29న సింగరేణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) ఎస్.అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా కాలనీలోని శాంతి మైదానంలో బతుకమ్మ వేడుకలు జరుగుతాయన్నారు. ఇదే రోజు ఫ్యామిలీ డే కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. సాయంత్రం 6గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు, కార్మిక కుటుంబ సభ్యులు హాజరుకావాల్సిందిగా కోరారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేయబడుతాయని తెలిపారు.

అద్దె చెల్లించని దుకాణానికి తాళం



తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండు వద్ద ఉన్న చికెన్, మటన్ దుకాణం యజమానులు దుకాణం అద్దె కొద్ది నెలల నుంచి చెల్లించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది మల్లయ్య, జయాకర్‌ల దుకాణాలకు తాళం వేశారు. వ్యాపారస్తులు ప్రతీ నెలా అద్దె, పన్నులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. అనంతరం దుకాణం యజమానులు కార్యాలయానికి వచ్చి అద్దె చెల్లించడంతో దుకాణం తాళాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది రాజయ్య, జెమున, అనిత, వినోద్, వేణు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల నిధుల వినియోగంపై ఆడిటింగ్



తనిఖీ చేస్తున్న ఆడిట్ బృందం

దండేపల్లి: గ్రామ పంచాయతీలకు 2024–25ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నిధుల వినియోగంపై దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జీపీల వారీగా ఆడిట్ నిర్వహించారు. మొదటి రోజు దండేపల్లి, కొత్తమామిడిపల్లి, పాత మామిడిపల్లి, తానిమడుగు, తాళ్లపేట, అల్లీపూర్ గ్రామ పంచాయతీలకు సంబంధించిన సాధారణ నిధులు, ఎస్ఎఫ్‌సీ, సీఎఫ్‌సీ నిధుల వినియోగంపై ఆడిట్ సభ్యులు రమేశ్, సుభాష్ చంద్రబోస్, సచిన్ రాహుల్ తనిఖీలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్‌లు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ



లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ముల్కల్లగూడ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకు 101మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల వెనుక ఉన్న బొట్లకుంట చెరువు నిండడంతో పాఠశాల ప్రహరీ వరకు నీరుచేరి ఎప్పుడు నిలువ ఉండడంతో గోడ కూలిపోయింది. త్వరగా మరమ్మతులు జరిపించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలని పాఠశాల ప్రదానోపాధ్యాయులు దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ లభ్యం

- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆగస్టు 6న హాజీపూర్ పోలీస్‌స్టేషన్లో కుమారుడు బొలిశెట్టి రాజేశ్ కనిపించడం లేదని బాధితుడి తల్లి మల్లక్క ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయ్యింది. కేసు దర్యాప్తులో భాగంగా హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు మండలంలోనే ఆచూకీ లభించడంతో మంగళవారం తల్లి బొలిశెట్టి మల్లక్కకు పోలీసులు అతడిని అప్పగించారు. అతడి మానసికస్థితి బాగోలేదని ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా భవనాలు



ఆస్నాదలో నిలిచిన పంచాయతీ భవన నిర్మాణం



కొమ్మెరలో మహిళా భవన నిర్మాణం...

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర, దుగ్నెపల్లి గ్రామాల్లో మహిళా సంఘాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. నిధులు రాకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. ఆస్నాదలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.



దుగ్నెపల్లిలో మహిళా భవన నిర్మాణం...

పునరావాసంపై నిర్లక్ష్యం..!

- ప్లాట్లు కేటాయించారు.. సౌకర్యాలు మరిచారు
- నెలలు గడిచినా నీటి, విద్యుత్ సౌకర్యాలు కరువు
- అర్థంతరంగా నిలిచిన రోడ్డు పనులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కాసిపేట: మండలంలోని దుబ్బగూడెం గ్రామస్తులకు పునరావాస కాలనీలో ప్లాట్లు కెటాయించి ఐదు నెలలు గడిచాయి. అయినా నేటి వరకు సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణిఖని ఓపెన్‌కాస్టు నిర్వాసిత గ్రామం దుబ్బగూడేనికి మూడేళ్ల క్రితం పరిహారం అందించారు. ఎన్నో రోజుల పడిగాపులు, ఆందోళనల తర్వాత సింగరేణి యాజమాన్యం, రెవెన్యూ అధికారులు లే అవుట్ కాలనీలో ఏప్రిల్ 17న 299మందికి ప్లాట్లు కెటాయించి, కొద్ది రోజులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించారు. కానీ ఇప్పటివరకు నీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించలేదు. గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పూర్తి కాలేదు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అనేక ఇబ్బందుల మధ్య ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన కొంతమంది మధ్యలోనే నిలిపేశారు. అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పి ప్లాట్లు కెటాయించిన సింగరేణి యాజమాన్యం ఇలా నిర్లక్ష్యం చేయడం సరికాదని, వెంటనే సమకూర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నీరు, కరెంట్ లేక నిలిచిన నిర్మాణాలు

దుబ్బగూడెంలో కూలిన ఇళ్లు..

మండలంలోని దుబ్బగూడెంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఓరం అనసూర్య అనే మహిళకు చెందిన ఇంటి గోడ ఈ నెల 20న తెల్లవారుజామున పూర్తిగా కూలింది. ఇళ్లు శిథిలావస్థకు చేరినా నివాసం ఉంటున్నామని, కేటాయించిన ప్లాట్ల వద్ద సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సగానికి పైగా ఇళ్లు అధికంగా వర్షం కురిస్తే కూలిపోయేలా ఉన్నాయని, ఆర్అండ్ఆర్ కాలనీలో వెంటనేనె సౌకర్యాలు కల్పించి నిర్మాణాలకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం పునరావాసం కింద ప్లాట్లు కేటాయించి సౌకర్యాలు కల్పించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో గృహాలు శిథిలావస్థకు చేరి కూలుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా యాజమాన్యం రోడ్డు నిర్మించి, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి.

– రామటెంకి వినయ్, దుబ్బగూడెం

కొనసాగుతున్న ఆందోళన



శ్రీరాంపూర్: ఎస్సార్పీ ఓసీపీ చెక్‌పోస్టు వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

- మూడు నెలలుగా వేతనాలు బంద్
- చెల్లించే వరకు నిరసనలు ఆగవని హెచ్చరిక
- ఓసీపీ చెక్‌పోస్టు వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీలోని సీఆర్ఆర్ ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వేతనాల కోసం చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ వారికి 3నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. పనులు బంద్ పెట్టారు. దీంతో కాంట్రాక్ట్ కార్మికులు కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. సోమవారం కూడా కాంట్రాక్ట్ కార్మికులతో కంపెనీ అధికారులు చర్చలు జరిపారు. కానీ కాంట్రాక్టర్ వేతనాలు రేపు.. మాపు.. అంటూ పేర్కొంటూ దాటవేస్తున్నారు. మంగళవారానికి కూడా వేతనాలు రాకవపోడంతో తిరిగి ఆందోళనకు దిగారు. ఓసీపీ చెక్ పోస్టు వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. కంపెనీ బొగ్గు వాహనాలను లోపలికి వెళ్లకుండా, బయటికి రాకుండా ఆపేశారు. దీంతో కంపెనీ అధికారులు వచ్చి చెప్పినా వినలేదు. చివరికి మధ్యాహ్నం పర్మినెంట్ కార్మికులు సెకండ్ షిఫ్ట్ కోసం వెళ్తుండగా వారిని కాంట్రాక్ట్ కార్మికులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పర్మినెంట్ ఉద్యోగులను పనులకు పంపించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులు మాట్లాడుతూ.. పండుగ సమీపిస్తున్న కూడా తమకు వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కంపెనీ అధికారులు కూడా తమకు న్యాయం చేయడం లేదన్నారు. రేపు మాపు వేతనాలు వస్తాయని మభ్య పెడుతున్నారని వాపోయారు. తమ వేతనాలు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారి కిషన్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.అనిత, వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 747ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 34,818మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం పౌష్టికాహారంతో పాటు రోజు విడిచి రోజు కోడిగుడ్డు అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు జూలై 2025వరకు చెల్లించినట్లు, పెండింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించనున్నట్లు తెలిపారు. జిల్లాలో దాదాపు 78శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం ద్వారా లబ్ధి పొందుతున్నారని, 100శాతం విద్యార్థులు లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 11శాతం పాఠశాలల్లో మాత్రమే కిచెన్ గార్డెన్స్ అందుబాటులో ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ముగిసిన ఆర్టీసీ కానిస్టేబుళ్ల శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లతో కమాండెంట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో 15రోజులుగా నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుళ్ల శిక్షణ మంగళవారం ముగిసింది. తెలంగాణ ఆర్టీసీ కానిస్టేబుళ్ల వార్షిక రిఫ్రెషర్ కోర్సు బెటాలియన్ కమాండెంట్ పీ వెంకటరాములు పర్యవేక్షణలో చట్టం, డ్రిల్, క్రమశిక్షణ, భద్రత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కానిస్టేబుళ్లు కూడా నిత్యం డ్రిల్ చేస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య, నాగేశ్వర్‌రావు, కాళిదాసు, శిక్షణ ఆర్ఐ భాస్కర్, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేలా అవగాహన కల్పించాలి

దండేపల్లి: స్వయం సహాయక సంఘాల మహిళలంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేలా గ్రామైఖ్య సంఘాలు కృషిచేయాలని జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత సూచించారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ మహిళ సమాఖ్య కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల సమాఖ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు కూడా ప్రతీ స్వయం సహాయక సభ్యురాలు వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు, సభ్యులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిత

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, చిన్నారుల శారీరక, మానసిక వికాసం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ.సంధ్యారాణి అన్నారు. గర్భిణులు, బాలింతలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఇంటి పెరడులో ఆకు కూరలు, కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచాలని సూచించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రూపాదేవి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, గర్భిణులు, పాల్గొన్నారు.

కదం తొక్కిన కాంట్రాక్ట్ కార్మికులు



శ్రీరాంపూర్‌లో కాంట్రాక్ట్ కార్మికుల నిరసన



కేకే-5 గనిపై టీబీజీకేఎస్ నాయకుల నిరసన



రామకృష్ణాపూర్: నిరసన తెలుపుతున్న కార్మికులు

- నల్ల బ్యాడ్జీలతో గనులపై నిరసన

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: సింగరేణి లాభాల్లో అంకెల గారెడి చేసి కార్మికులను మోసం చేశారని నిరసిస్తూ టీబీజీకేఎస్, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో వేర్వేరుగా మంగళవారం నిరసన తెలిపారు. ఆ యూనియన్ల కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులు డిపార్ట్‌మెంట్‌లపై మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంస్థకు వచ్చిన లాభాలు రూ.6394కోట్లని అందులో నుంచి పెట్టుబడుల పేరుతో రూ.4034కోట్లు పక్కన పెట్టి మిగిలిన రూ.2360కోట్ల నుంచి 34శాతం వాటా రూ.802.4కోట్లు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. వాస్తవ లాభాల లెక్కన ఇది కేవలం 12.6శాతం వాటానేనన్నారు. అంకెల గారెడితో కార్మికులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. గత సంవత్సరం కూడా ఇలాగే మోసం చేశారన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ట్యాక్స్‌లు పోను మిగిలిన లాభాలపై వాటా ప్రకటించామన్నారు. లాభాల వాటా సాధనలో గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. సంస్థ లాభాలు సాధించటంలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఎంతో ఉందని, అయితే పర్మినెంట్ కార్మికులకు ఒక్కొకరికి రూ.లక్ష 95వేలు ప్రకటించి కాంట్రాక్ట్ కార్మికులకు కేవలం రూ.5,500 ప్రకటించడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు స్పందించకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఆయా గనులపై వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం, మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిపై టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, ఐఎఫ్‌టీయూ శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు శంకర్, సత్యం, రామకృష్ణాపూర్‌లో ఐఎఫ్‌టీయూ నాయకులు నడిగోట శంకర్, మంద శంకర్, సూర్యప్రకాష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలతోనే క్షయ నివారణ

- బాధితులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

బెల్లంపల్లిరూరల్: రక్షణ చర్యలు పాటించడంతోనే క్షయను నివారించవచ్చని తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇవాంజలీన్ అన్నారు. పీహెచ్‌సీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా క్షయ దరిచేరకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం తరుపున సరఫరా అయిన న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. క్షయ నివారణ కోసం ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్య బృందంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహిళలకు గైనకాలజీ, గ్రామీణులకు జనరల్ ఫిజిషియన్, సర్జరీ వైద్య పరీక్షలు చేపట్టి మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ వైద్య సేవలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు స్నేహ, శ్రీనివాస్, శివతేజ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మల్లిక, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, సిబ్బంది వెంకటేశం, చెన్న కేశవులు, సుధాకర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు కిట్లు అందిస్తున్న వైద్యాధికారులు

బెల్లంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో...

బెల్లంపల్లి: బెల్లంపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళ టీబీ పేషెంట్లకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదు, విలువైన ప్రొటీన్ ఆహార కిట్లను బెల్లంపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుచరిత అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్తయ్య, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, హెల్త్ విజిటర్ వెంకటేశం, ల్యాబ్ టెక్నిషియన్ చెన్నకేశవులు, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేందర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, టీబీ వ్యాధి గ్రస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఎస్‌బీఐలో అగ్నిప్రమాదం

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో మంగళవారం మధ్యాహ్నం జనరేటర్ నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. గమనించిన బ్యాంకు సిబ్బంది వెంటనే ఎన్టీపీసీ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

వేమనపల్లి: మండలంలోని నీల్వాయిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కోటేశ్వర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.వెయ్యి నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు

భీమిని: మండలంలోని మామిడిపల్లిలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో మంగళవారం భారీ వర్షం కురిసింది. ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడడంతో గ్రామానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

జాబ్‌మేళాకు స్పందన

మందమర్రిరూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదిలాబాద్ కథోలికా మైత్రాసన, డాన్‌బాస్కో వారి ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 22 సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 400మంది అభ్యర్థులు హాజరుకాగా, 210 మంది ఎంపికయ్యారు. 60మంది అభ్యర్థులకు ఉద్యోగ నియామకపత్రాలు అందించా రు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పీఠం యూత్ డైరెక్టర్ జిజో ఫాదర్ జస్టిన్, కార్మెల్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ జివియర్ రెక్స్, ఫాదర్ సాఫిన్, వివిధ సంస్థల నిర్వాహకులు ఉన్నారు.



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు